క్లుప్తంగా

పన్ను చెల్లించాలి



ఆర్మూర్‌టౌన్: పట్టణ ప్రజలు పన్ను చెల్లించాలని మున్సిపల్ మేనేజర్ హయూమ్ కోరారు. పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో ఉన్న ఓ భవనం యజమాని పన్ను చెల్లించకపోవడంతో మున్సిపల్ కమిషనర్ రాజు ఆదేశాల మేరకు బుధవారం భవనాన్ని సీజ్ చేశారు. మూడు సంవత్సరాలకు సంబంధించి రూ.5,25,000 పన్ను చెల్లించాల్సి ఉందని అధికారులు తెలిపారు. పన్ను సకాలంలో చెల్లించి అభివృద్ధికి సహకరించాలని వారు కోరారు.

నేడు బోధన్ బార్ అసోసియేషన్ ఎన్నికలు

బోధన్: పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో ఉన్న బార్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం బార్ ఎన్నికలను నిర్వహించనున్నట్లు ఎన్నికల ప్రధాన అధికారి, సీనియర్ న్యాయవాది సీహెచ్ హన్మంత్‌రావు బుధవారం తెలిపారు. ఎన్నికల సహాయ అధికారిగా జి రవీందర్‌ను నియమించామని, ఈనెల 18 నుంచి 20వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, ఉపసంహరణ ప్రక్రియను పూర్తి చేశామని తెలిపారు. అధ్యక్ష పదవికి వీఆర్ దేశాయ్, ఈ పోశెట్టి, ప్రధాన కార్యదర్శి పదవికి ఎస్ఎస్ఆర్ కోటేశ్వర్‌రావు, నీరడి ఈశ్వర్ పోటీలో ఉన్నారని తెలిపారు. ఉపాధ్యక్ష, సంయుక్త కార్యదర్శి, కోశాధికారి, గ్రంథాలయ కార్యదర్శి పదవుల ఎన్నిక ఏకగ్రీవమైందన్నారు. గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు పోలింగ్, మధ్యాహ్నం 3గంటలకు ఓట్ల లెక్కింపు నిర్వహించి ఫలితాలు వెల్లడిస్తామని తెలిపారు.

5కే రన్..

బోధన్‌టౌన్(బోధన్): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సిస్టమెటిక్ ఓటర్స్ అండ్ ఎడ్యుకేషన్, అండ్ ఎలక్ట్రోరల్‌లో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాలను మేరకు గురువారం బోధన్‌లో 5 కే రన్ నిర్వహించనున్నట్లు ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7:30 గంటలకు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి రన్ ప్రారంభమై అంబేద్కర్ చౌరస్తా మీదుగా కొత్త బస్టాండ్ వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. పట్టణ ప్రముఖులు, యువత, అధికారులు హాజరు కావాలని కోరారు.

కుట్టు మిషిన్ల పంపిణీ



డొంకేశ్వర్(ఆర్మూర్): డొంకేశ్వర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మహాజన సభ చైర్మన్ బార్ల భరత్ రాజిరెడ్డి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. సొసైటీ ద్వారా ఇప్పటి వరకు రైతులకు అందించిన సేవలను వివరించారు. యాసంగి వడ్ల కొనుగోలుపై చర్చించారు. అనంతరం సొసైటీ ద్వారా 21మంది మహిళా సభ్యులకు రుణంపై కుట్టు మిషిన్లు అందజేశారు. టైలరింగ్ ద్వారా మహిళలు ఉపాధిని పొంది ఆర్థికాభివృద్ధి సాధించాలని చైర్మన్ కోరారు. రైతులకు గిరిజాతి ఆవులను అందిస్తామన్నారు. వైస్ చైర్మన్ మోర్తాడ్ ముత్యం, బ్రాంచ్ మేనేజర్ రాధా, సంఘం డైరెక్టర్లు, కార్యదర్శి కృష్ణకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

మాక్లూర్: మండల పశువైద్యశాఖ ఆధ్వర్యంలో మండలంలోని ముల్లంగి(బి), గంగరమంద, గద్వాల్ క్యాంప్‌లలో బుధవారం పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. గ్రామాల వారీగా వైద్యశిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని, పశుపోషకులు పశువులకు టీకాలు వేయించాలని వైద్యులు కిరణ్‌దేశ్‌పాండే, ఉమా సహేర్ తెలిపారు. పశువైద్యసిబ్బంది జైల్‌సింగ్, గంగాజమున, సుధీర్, అహ్మద్‌పాషా, శ్రీనివాస్, పుష్ప, వినీత, మహేశ్వరి, గంగాధర్, లక్ష్మి పాల్గొన్నారు.

పన్ను వసూలుకు స్పెషల్ డ్రైవ్

మాక్లూర్: ఇంటి పన్ను వసూలు కోసం మండలంలోని డీకంపల్లిలో బుధవారం డీఎల్‌పీవో శ్రీనివాస్ నేతృత్వంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇంటి పన్ను సకాలంలో చెల్లించి అభివృద్ధికి సహకరించాలని అధికారులు కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు దినేశ్, చంద్రశేఖర్, రాకేశ్‌తో తదితరులు పాల్గొన్నారు. గొట్టిముక్కల గ్రామంలో కూడా స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు.

చలివేంద్రం ప్రారంభం

డిచ్‌పల్లి: మండల కేంద్రంలోని నడిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీడీవో రవీందర్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం హర్షణీయమని జీపీ సిబ్బందిని అభినందించారు. అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ నరేందర్‌రాజు, ఎంపీవో శ్రీనివాస్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి నిట్టు కిషన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

పునర్నిర్మాణాన్ని మరిచారా?

- వర్షానికి కూలిన డ్రైయినేజీ
- రెండేళ్లవుతున్నా పట్టించుకోని అధికారులు



బాల్కొండలో రెండేళ్ల క్రితం వర్షానికి కూలిన మురికికాలువ

బాల్కొండ: మండల కేంద్రంలోని ఏబీనగర్‌లో నిర్మించిన సీసీ డ్రైయినేజీ నిర్మించిన రెండు నెలలకే వర్షం కారణంగా కూలిపోయింది. వర్షానికి డ్రైయినేజీ కూలిపోవడం ఏమిటని అప్పట్లో పెద్ద చర్చ జరిగింది. అయినప్పటికీ మురికి కాలువ పునర్నిర్మాణాన్ని మరిచిపోయారు. రెండేళ్ల క్రితం బాల్కొండ మండలకేంద్రంలో రోడ్డు వెడల్పు, సెంట్రల్ లైటింగ్ పనులతోపాటు గ్రామం చుట్టూ తారురోడ్డు కోసం ప్రభుత్వం రూ.8 కోట్లు మంజూరు చేసింది. ఇందులో భాగంగా రోడ్డు పక్కన మురికి కాలువల నిర్మాణ పనులను ఆర్‌అండ్‌బీ ఆధ్వర్యంలో చేపట్టారు. రెండేళ్ల క్రితం భారీ వర్షాలు కురవగా, నీటి ఉధృతి కారణంగా ఓ వైపు సీసీ డ్రైయినేజీ కుప్పకూలింది. అప్పటి నుంచి కూలిన సీసీ మురికినీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న పట్టించుకునే వారు కరువయ్యారు. కనీసం కూలిన సీసీ కూడా తొలిగించ లేదు. మురికి నీరు అక్కడే నిలుస్తుండడంతో దోమల బెడద తీవ్రమై స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి వెంటనే సీసీ డ్రైయినేజీని పుననిర్నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్డుపై ప్రవహిస్తున్న మురికినీరు

బాల్కొండ మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం నుంచి కిసాన్‌నగర్ శివారు వరకు తారు రోడ్డు వెడల్పు కోసం గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసి పనులను ప్రారంభించింది. రోడ్డు వెడల్పు పనుల్లో భాగంగా తవ్వకాలు చేపట్టి కంకర వేశారు. తవ్వకం పనుల కారణంగా ముందున్న మురికి కాలువలు కొట్టుకుపోయి మురికినీరు పాత జాతీయ రహదారిపై ప్రవహిస్తోంది. ముందుగా సీసీ డ్రైయినేజీలు ఇరుపక్కల నిర్మించకుండా రోడ్డు పనుల కోసం తవ్వకం పనులు చేపట్టారు. ప్రస్తుతం ఆ పనులు కూడా నిధుల లేమితో పడకేశాయి. దీంతో ఆ రోడ్డు మీదుగా ప్రయాణించే వారికి తిప్పలు తప్పడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే మురికికాలువలను నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

> **ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం**
>
> గతంలో కూలిపోయిన సీసీ డ్రైయినేజీ అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. రోడ్డు వెడల్పు పనుల్లో భాగంగా ముదుగా సీసీ డ్రైయినేజీ నిర్మాణ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటా.
>
> – వినీత్, ఆర్‌అండ్‌బీ ఏఈ, బాల్కొండ

కుటుంబ పాలనకు చరమగీతం పాడాలి

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ



రుద్రూర్‌లో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

రుద్రూర్: కుటుంబ పాలనకు చరమగీతం పాడాల్సిన సమయం ఆసన్నమైందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ అన్నారు. కోటగిరి, రుద్రూర్ మండల కేంద్రాల్లో బీజేపీ కార్యాలయాలను పార్టీ జిల్లా అధ్యక్షురాలు అరుణతారతో కలిసి బుధవారం ప్రారంభించారు. బీఆర్ఎస్ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జిగా పోచారం భాస్కర్‌రెడ్డిని ఎమ్మెల్యే నియామకం చేయడం సమంజసం కాదన్నారు. పార్టీలో ఎంతో మంది సీనియర్లు ఉండగా తన తనయుడికే కట్టబెట్టడం ఏమిటని ప్రశ్నించారు. ధాన్యానికి మద్దతు ధర కన్నా రూ. ఐదు వందలు ఎక్కువ ఇస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి కనీసం కొనుగోలు కేంద్రాలు కూడా ఏర్పాటు చేయక పోవడం విడ్డూరమన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై విమర్శలు గుప్పించారు. జహీరాబాద్ బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని పార్టీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార కోరారు. బీజేపీ గెలుపునకు పార్టీ నాయకు లు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని కోరారు. పార్టీ రుద్రూర్, కోటగిరి మండలాల అధ్యక్షులు ఆలపాటి హరికృష్ణ, నవీన్, జిల్లా ఉపాధ్యక్షుడు దొరబాబు, అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్, వైస్ ఎంపీపీ గంగాధర్ పటేల్, కాపుగాండ్ల శ్రీనివాస్, సుధా కర్ గౌడ్, కృష్ణం రాజు, గణేశ్, నాగం సాయిలు, మక్కయ్య, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బందులు ఉండొద్దు



తగ్గెల్లి శివారులో కరెంట్ బోరువేయిస్తున్న డీపీవో తరుణ్‌కుమార్, అధికారులు

బోధన్: ఎండ తీవ్రత పెరిగిన దృష్ట్యా గ్రామాల్లో తాగు నీటి సమస్య పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని డీపీవో తరుణ్‌కుమార్ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. బుధవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ రాఘుతో కలిసి డీపీవో సాలూర మండలంలోని తగ్గెల్లి గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో తాగునీటి సమస్యను తెలుసుకున్నారు. ప్రజలు నీటికోసం ఇబ్బందులు పడకుండా గ్రామ శివారులోని మంజీర నదిలో కొత్తగా కరెంట్ బోరును వేయించారు. గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడారు. ఆస్తి పన్ను వసూళ్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. డీపీవో వెంట ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ అనిల్, ఎంపీవో మధుకర్ ఉన్నారు.

ఎకరానికి రూ.25వేల పరిహారం ఇవ్వాలి



కుమ్మన్‌పల్లి శివారులో దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బోధన్: అకాల వర్షాల కారణంగా పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25వేల చొప్పున పరిహారం ఇవ్వాలని బోధన్ మండలం పెంటాకుర్దు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు శివసాయి పటేల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సాలూర మండలంలోని కుమ్మన్‌పల్లి గ్రామ శివారులో రైతు రాంబాబుకు చెందిన మొక్కజొన్న పంట దెబ్బతినగా, బుధవారం పంటను శివసాయి పటేల్‌తోపాటు మాజీ సర్పంచులు పరిశీలించారు. గ్రామ పరిధిలో సుమారు వంద ఎకరాల వరకు పంటకు నష్టం వాటిల్లిందన్నారు. పంట నష్టంపై పారదర్శకంగా సర్వే చేసి రైతులకు పరిహారం అందించి ఆదుకునేందుకు వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. పెంటాకుర్దు క్యాంప్, పెంటాకుర్దు, కుమ్మన్‌పల్లి గ్రామాల మాజీ సర్పంచులు సుదర్శన్ పటేల్, శ్రీనివాస్‌రావు, కొర్వా గంగాధర్, రైతులు పాల్గొన్నారు.

కల్వర్టుపై తారు వేయరూ..

వేల్పూర్: మండలంలోని పచ్చలనడ్కుడ గ్రామ ప్రధాన డ్రైయినేజీపై నిర్మించిన కల్వర్టుపై కంకరవేసి వదిలేశారని, తారు వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రధాన డ్రైయినేజీపై ఉన్న కల్వర్టు శిథిలావస్థకు చేరడంతో ఏడెనిమిది నెలల క్రితం సుమారు రూ.15లక్షలతో నూతన కల్వర్టును నిర్మించినప్పటికీ.. కల్వర్టుపై కంకర, కంకర మిశ్రమాన్ని వేసి అలాగే వదిలేశారు. ఆర్మూర్, భీమ్‌గల్‌కు వెళ్లేందుకు ప్రధాన రోడ్డు ఇదే కావడంతో.. ప్రతిరోజూ వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దుమ్మూధూళి లేవడంతో గ్రామస్తులతోపాటు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నూతన కల్వర్టును నిర్మించినప్పటికీ తారు వేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే కల్వర్టుపై తారు వేయాలని కోరుతున్నారు.



రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం

సిరికొండ: ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామని సొసైటీ చైర్మన్ రాములునాయక్ అన్నారు. మండలంలోని తూంపల్లి సొసైటీలో మహజన సభను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వానకాలం సీజన్‌కు రైతులకు సరిపడా ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచుతామని తెలిపారు. అనారోగ్యంతో ఏడాది కిందట మృతి చెందిన కీర్యానాయక్ స్థానంలో డైరెక్టర్‌ను ఎందుకు భర్తీ చేయడం లేదని కొండాపూర్‌కు చెందిన రైతులు పాలకవర్గాన్ని ప్రశ్నించారు. భర్తీకి సంబంధించిన ఏర్పాట్లను త్వరలోనే చేపడతామని చైర్మన్ తెలిపారు. కొత్తగా ఏర్పాటు చేసిన కార్యాలయాన్ని ప్రారంభించారు. వైస్ చైర్మన్ అబ్బాస్, డైరెక్టర్లు లక్ష్మణ్, సుధ, రమేశ్, రూప్‌సింగ్, యశోద, పోమాలు, లక్ష్మి, సావిత్రి, సీఈవో దేవీలాల్, సిబ్బంది నరేశ్, మహిపాల్, ప్రవీణ్, మాజీ సర్పంచ్ దేవరాజు, శ్రీధర్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ హామీతో సమ్మె విరమణ

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి తాత్కాలిక సిబ్బందికి వేతనాలు చెల్లిస్తామని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు హామీ ఇవ్వడంతో సమ్మెను తాత్కాలికంగా విరమిస్తున్నట్లు తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సుధాకర్ తెలిపారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్‌ను కలిసి వేతనాలు చెల్లించాలని కోరగా, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ నిధుల నుంచి వేతనాలు చెల్లిస్తామని హామీ ఇచ్చారన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు నర్సింగ్‌రావ్, శంకర్ ఉన్నారు.

కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ నాయకుల చేరిక



మాక్లూర్: మండలంలోని రాంచంద్రపల్లికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు కాంగ్రెస్‌లో చేరారు. మాజీ సర్పంచ్ గున్నం గంగారాంతోపాటు తాజా మాజీ ఉప సర్పంచ్ భూపతి, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బుర్రె సాయన్న బుధవారం కాంగ్రెస్‌లో చేరగా, ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గుత్ప మాజీ సర్పంచ్ గంట చిన్నయ్య, ఎన్ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షుడు శశికుమార్, ప్రభాకర్, సుదర్శన్ పాల్గొన్నారు.

పెంచిన టెట్ ఫీజును తగ్గించాలి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణలో టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్)–2024 ఫీజు పెంచడం పేద నిరుద్యోగ అభ్యర్థులకు అన్యాయం చేయడమేనని ఏబీవీపీ జాతీయ కార్యవర్గసభ్యులు శివ పేర్కొన్నారు. తెయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శివ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన టెట్ నోటిఫికేషన్‌కు ఈనెల 27 నుంచి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. ఈసారి టెట్ దరఖాస్తు ఫీజు భారీగా పెంచడం వల్ల నిరుద్యోగులపై భారం పెరుగుతుందని విమర్శించారు. 2021లో టెట్ పరీక్ష ఫీజు రూ.200, 2022లో రూ.300, 2023లో రెండు పేపర్లకు కలిపి రూ.400లు ఉండేదన్నారు. ప్రస్తుతం 2024లో ఒక పేపర్‌కు రూ.వేయి, రెండు పేపర్లకు రూ.2వేలు పెంచడం దారుణమని ఆరోపించారు. ఒకేసారి ఇంతపెద్ద మొత్తంలో ఫీజు పెంచడం కారణంగా నిరుద్యోగ అభ్యర్థులకు ఇబ్బందులు పడుతారని పేర్కొన్నారు. వర్సిటీ కార్యదర్శి అమృత్, ఉపాధ్యక్షులు పావని, సింహాద్రి, తరుణ్, మహర్షి, రాము, సమీర్, మోహన్, బాల్‌రాజ్, హర్ష, అక్షయ్, హరినాథ్ పాల్గొన్నారు.

ఔషధాల తయారీపై అవగాహన

నిజామాబాద్‌అర్బన్: నగరంలో గిరిరాజ్ కళాశాలలో రసాయన శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో బుధవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ యూనివర్సిటీ కెమిస్ట్రీ విభాగాధిపతి బాలకృష్ణ ఔషధాల తయారీ పద్ధతులు, ఆవిష్కరణలపై అవగాహన కల్పించారు.

ఏప్రిల్ 3న సెమినార్



నిజామాబాద్‌నాగారం: మల్లు స్వరాజ్యం ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఏప్రిల్ 3న నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో 'రాజ్యాంగానికి ప్రమాద గంటికలు' అనే అంశంపై సెమినార్ నిర్వహించనున్నట్లు ప్రజాస్వామ్య పరిరక్షణ సమితి కన్వీనర్ డాక్టర్ రవీంద్రనాథ్ సూరి అన్నారు. నగరంలోని సంస్థ కార్యాలయంలో బుధవారం సమావేశాన్ని ఏర్పాటు చేసి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్ మాట్లాడుతూ.. సెమినార్‌కు ముఖ్యఅతిథిగా జస్టిస్ చంద్రకుమార్, అతిథులుగా పద్మజాషా, ఎండీ అబ్బాస్, నర్రా రామారావు తదితరులు హాజరవుతారని తెలిపారు. దేశంలో ప్రశ్నించే వారిపై, హక్కుల కోసం ఉద్యమిస్తున్న వారిపైన ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. రాజ్యాంగ మౌలిక సూత్రాలను మార్చేందుకు కుట్రలు సాగుతున్నాయని ప్రతి ఒక్కరూ దీనిని వ్యతిరేకించాలని అన్నారు. ప్రజలను చైతన్యం చేసే చర్యల్లో భాగంగా సెమినార్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో మల్లు స్వరాజ్యం ట్రస్ట్ కార్యదర్శి రామ్మోహన్‌రావు, షేక్ హుస్సేన్, ఈవిల్ నారాయణ, ప్రసాద్‌రావు, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో రాజాగౌడ్

డొంకేశ్వర్(ఆర్మూర్): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్ సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం డొంకేశ్వర్ మండల కేంద్రానికి వచ్చిన ఆయన పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, ర్యాంపు సౌకర్యాలు కచ్చితంగా ఉండాలన్నారు. ఓటర్లతో పాటు విధులు నిర్వహించే సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. అలాగే పోలింగ్ కేంద్రాలకు రాలేని పరిస్థితుల్లో ఉన్న వృద్ధులు, వికలాంగులను గుర్తించాలని సూచించారు. బీఎల్వోలు ఈ అంశాలను నిర్లక్ష్యం చేయొద్దన్నారు. ఆయనవెంట తహసీల్దార్ వెంకటరమణ, ఆర్ఐ రాజేశ్వర్, సర్వేయర్ కిషన్, పంచాయతీ కార్యదర్శి శేఖర్‌గౌడ్ ఉన్నారు.

ఆర్మూర్‌లో 'లాభార్థి సంపర్క్ అభియాన్'



కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

ఆర్మూర్‌టౌన్: బీజేపీ ఆధ్వర్యంలో పట్టణంలో బుధవారం 'లాభార్థి సంపర్క్ యోజన' కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్లమెంట్ కన్వీనర్ పుప్పాల శివరాజ్ రాంనగర్‌లో కార్యక్రమాన్ని ప్రారంభించగా, నాయకులు కేంద్ర ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందిన వారి ఇళ్లకు వెళ్లి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి స్టిక్కర్లను డోర్లకు అతికించారు. మరోసారి బీజేపీకి ఓటువేసి మోదీని, అర్వింద్‌ను గెలిపించాలని కోరారు. దేశం కోసం ధర్మం కోసం మోదీ ప్రధానమంత్రి కావడం ఎంతో అవసరమని అన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి, లాభార్థి సంపర్క్ యోజన కన్వీనర్ కలిగొట గంగాధర్, బీజేపీ నగర అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, ప్రధాన కా ర్యదర్శులు పోల్కం వేణు, యుగేంధర్, నాయకులు డీకే శ్రీనివాస్, బూత్ అధ్యక్షుడు వినోద్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ల చైర్మన్‌లకు సన్మానం



మోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు



కిసాన్‌నగర్‌లో ఈరవత్రి అనిల్‌ను..

బాల్కొండ: కో ఆపరేటివ్ యూనియన్ కార్పొరేషన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డిని ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకులు బుధవారం జిల్లా కేంద్రంలో సన్మానించారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో మోహన్‌రెడ్డిని నాయకులు కలిశారు. భవిష్యత్‌లో ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు. నాయకులు కొమ్ముల శ్రీనివాస్, పోల ప్రవీణ్‌కుమార్, శ్రీధర్, ప్రశాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈరవత్రి అనిల్‌కు..

రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్‌ను బాల్కొండ మండలం కిసాన్‌నగర్‌లో ఆయన నివాసంలో కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. డీసీసీ ఉపాధ్యక్షుడు రాజ్‌కుమార్, డీసీసీ డెలిగేట్ చంద రవి, నాయకులు బద్దం సాగర్, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోవాలి



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ రాధిక రాథోడ్

బోధన్: గర్భిణులు, బాలింతలు పోషకారం తీసుకోవాలని ఐసీడీఎస్ పట్టణ సూపర్‌వైజర్ రాధిక రాథోడ్ సూచించారు. పోషణా పక్షం (పోషణ్ అభియాన్)లో భాగంగా బుధవారం పట్టణంలోని గాంధీనగర్ కాలనీలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు తమ పేర్లను అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదు చేయించుకోవడంతోపాటు అక్కడే భోజనం చేయాలన్నారు. ఇళ్ల ఆవరణలో పెరటి తోటను ఏర్పాటు చేసుకుని కూరగాయలు, ఆకుకూరలను సాగు చేయాలని, చిరుధాన్యాలను స్వీకరించాలన్నారు. రక్తహీనత ఉన్న గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మి, విక్టోరియా రాణి, శేషమ్మ, పుష్ప, శ్యామల, హాజీరా, అర్చన, సరోజ తదితరులు పాల్గొన్నారు.

సజ్జ పంట పరిశీలన



ఆలూర్‌లో సజ్జను పరిశీలిస్తున్న ఏవో హరికృష్ణ

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండలం కేంద్రంలో రైతులు సాగు చేస్తున్న సజ్జ పంటను మండల వ్యవసాయ శాఖ అధికారి హరికృష్ణ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సజ్జలో పురుగు ఉధృతి అధికంగా ఉందన్నారు. పురుగు నివారణ కోసం ఎకరానికి 80 ఎంఎల్ క్లోరంత్రనిలిప్రోల్ మందును ఒక లీటరు నీటిలో లేదా ఇమమెక్టిన్ బెంజొయేట్, నోవానూరన్ 300 ఎంఎల్ లేదా క్లోరంత్రనిలిప్రోల్, సైలోత్రెన్ 100 ఎంఎల్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఆయనవెంట ఏఈవో వసుదాం, రైతులు ఉన్నారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో ఉద్యమించాలి



సిరికొండ: స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ స్ఫూర్తితో యువకులు ఉద్యమించాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ నాయకుడు పిట్ల రామకృష్ణ అన్నారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 93వ వర్ధంతి వారోత్సవాల్లో భాగంగా మండలంలోని రావుట్లలో మంగళవారం రాత్రి కాగడాల ప్రదర్శన నిర్వహించారు. రమేశ్, దామోదర్, గోదావరి, అనీస్, సాయారెడ్డి, లింబాద్రి, రమేశ్, భూమేశ్, సాయిలు, రాజేందర్, బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	ఓం భీం బుష్ (తెలుగు) – 4.05 లైన్‌మెన్ (తెలుగు) – 7.15 గామి (తెలుగు) – 10.00
స్క్రీన్-2 –	ప్రేమలు (తెలుగు) – 12.00, 3.15, 6.30, 9.45
స్క్రీన్-3 –	ఓం భీం బుష్ (తెలుగు) – 11.00, 2.10, 6.05, 9.15
స్క్రీన్-4 –	రజాకార్ (తెలుగు) – 12.15, 3.30, 6.45, 10.00